
సాక్షి అనంతపురం

గురువారం । 26 । జనవరి । 2023



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



టమాట కిలో రూ.14

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.14, కనిష్టం రూ.4.50, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
31.9°/16.8°

జిల్లా అంతటా బుధవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగాను పెరిగాయి.

న్యూస్‌రీల్

1.78 లక్షల క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయింపు



విత్తన వేరుశనగ

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్–2023కు సంబంధించి ఉమ్మడి అనంతపురం జిల్లాకు 1.78 లక్షల క్వింటాళ్ల రాయితీ విత్తన వేరుశనగ కేటాయించినట్లు వ్యవసాయ, ఏపీ సీడ్స్ వర్గాలు తెలిపాయి. ఇందులో మొదటి విడత కింద లక్ష క్వింటాళ్లు శ్రీసత్యసాయి జిల్లాకు, 78 వేల క్వింటాళ్లు అనంతపురం జిల్లాకు కేటాయించారని పేర్కొన్నాయి. డిమాండ్, అవసరాన్ని బట్టి రెండో విడత కేటాయింపులు ఉంటాయని వెల్లడించాయి. నాణ్యమైన విత్తన వేరుశనగను మే 15 నాటికి ఏపీ సీడ్స్ ద్వారా సేకరించి ఆర్‌బీకేలకు సరఫరా చేయనున్నట్లు తెలిపాయి. మే చివరి వారం నుంచి జూన్ ఆఖరు దాకా రాయితీపై రైతులకు విత్తన పంపిణీ చేస్తామని పేర్కొన్నాయి. ప్రభుత్వం ఆదేశాల మేరకు కే–6, కదిరి–లేపాక్షి 1812 రకం విత్తన వేరుశనగతో పాటు ఖరీఫ్‌లో కందులు, చిరుధాన్యాలు, జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు కూడా రాయితీతో ఇవ్వడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించాయి.

ప్రాణం తీసిన పని ఒత్తిడి

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



మృతి చెందిన అశోక్ (ఫైల్)

బొమ్మనహాళ్: పని ఒత్తిడి భరించలేక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ రమణ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌కు చెందిన కాద్రా కృష్ణమూర్తికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు కాద్రా అశోక్ (26) బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి చేరుకుని వర్క్ ఫ్రం హోమ్ ద్వారా పనిచేస్తున్నాడు. అయితే పని ఒత్తిడి పెరగడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం సాయంత్రం గ్రామ సమీపంలోని హెచ్చెల్సీ వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి బళ్లారి విమ్స్‌కు తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకపోవడంతో బుధవారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నేడు గణతంత్ర వేడుకలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఉదయం ఎనిమిది గంటలకు గణతంత్ర వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

తాడిపత్రి విద్యార్థినికి జాతీయస్థాయి అవార్డు





ఎంపికైన నేతాజీ చిత్రం, సాయి నిఖిత

తాడిపత్రి టౌన్: తాడిపత్రిలోని మెయిన్ బజార్‌కు చెందిన వద్ది జ్యోత్స్న, మోహన్ దంపతుల కుమార్తె సాయి నిఖిత జాతీయస్థాయి చిత్రలేఖన అవార్డు అందుకుంది. ఫార్మా–డీ కోర్సు ఫైనలియర్ చదువుతున్న నిఖిత ఇరవై రోజుల క్రితం ఆన్‌లైన్ ద్వారా జరిగిన జాతీయస్థాయి నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రలేఖన పోటీల్లో పాల్గొంది. నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రాన్ని అక్షర రూపంలో అత్యంత ఆకర్షణీయంగా చిత్రీకరించి అవార్డు గెలుచుకుంది. బుధవారం రాత్రి ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా సాయి నిఖిత అవార్డును అందుకుంది.

దూరవిద్య బీఈడీ ఫలితాలు విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం దూరవిద్య బీఈడీ రెండో సంవత్సరం ఫలితాలను బుధవారం వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి విడుదల చేశారు. మొత్తం 362 మంది పరీక్షలకు హాజరుకాగా, 342 మంది విద్యార్థులు (94.48శాతం) ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎ.మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.శ్రీరాములు నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



వేడుకలకు సిద్ధమైన పోలీస్ పరేడ్ గ్రౌండ్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్/ అర్బన్: నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ 74వ గణతంత్ర వేడుకలకు సిద్ధమైంది. అధికార యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు కలెక్టర్ నాగలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పరేడ్ సమీక్షిస్తారు. సాయుధ దళాల చేత గౌరవ వందనం స్వీకరిస్తారు. ప్రగతి నివేదికపై ప్రజలకు సందేశం వినిపిస్తారు. వివిధ పథకాల కింద లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ చేపడతారు. ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకిస్తారు.

381 మందికి అవార్డులు

విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనపర్చిన 31 మంది జిల్లా అధికారులు, 350 మంది వివిధ స్థాయి అధికారులు, ఉద్యోగులు, ఉత్తమ సేవలు అందించిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను అవార్డులకు ఎంపిక చేశారు. వీరికి గణతంత్ర వేడుకల్లో అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. ఇదిలా ఉండగా పరేడ్ రిహార్సల్స్‌ను ఎస్పీ ఫక్కీరప్ప బుధవారం పరిశీలించారు. ముఖ్య అతిథుల హాజరు, సీటింగ్, జాతీయ పతాకావిష్కరణ, గౌరవ వందన రిహార్సల్స్‌ను ప్రత్యేక వాహనంలో వెళ్లి పరిశీలించి.. సలహాలు, సూచనలు ఇచ్చారు. వేడుకల వేళ ఎస్పీ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. నగరంలో ప్రతి అనుమానిత ప్రదేశాన్ని బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా పరిశీలించారు.



పోలీసు జాగిలం రిహార్సల్



రిహార్సల్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప



మూడు ముళ్లు



- బాల్య వివాహాలతో అనర్థాలు
- యుక్తవయసు దాటకముందే అమ్మతనమేల?
- మానసిక రుగ్మతలతో జీవితాంతం సతమతం
- బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేస్తున్న అధికారులు

కంటికి రెప్పలా చూసుకుంటూ వచ్చిన తల్లిదండ్రుల్లో కొందరు తమ పిల్లల పెళ్లి విషయంలో మాత్రం తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారు. అమ్మాయికి చిన్న వయసులోనే పెళ్లి చేసి గుండెలమీద బరువు దింపేసుకోవాలనుకుంటున్నారు. బాల్య వివాహాల పర్యవసానం తెలియక వారిని అగాథంలోకి నెట్టేస్తున్నారు. ఎదురు చెప్పలేక.. మెడ వంచి తాళి కట్టించుకున్న అమ్మాయిల జీవితం బుగ్గిపాలవుతోంది. ఈ దురాచారానికి అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం చట్టాలను కఠినతరం చేసింది. అధికారుల నిరంతర పర్యవేక్షణతో క్రమేణా బాల్య వివాహాలకు చెక్ పడుతోంది.

ఉమ్మడి జిల్లాలో బాల్య వివాహాల వివరాలిలా..

సంవత్సరం	అడ్డుకున్న వివాహాలు	కుటుంబ సభ్యులకు అప్పగింత	హోమ్‌లో ఉన్న వారు
2019	396	396	0
2020	337	337	0
2021	357	357	0
2022	294	291	3

రాయదుర్గం: అభం శుభం తెలియని బాలికలను 'మూడు ముళ్ల' బంధం చిదిమేస్తోంది. గర్భసంచి కూడా ఇంకా వృద్ధి కాని సమయంలోనే తల్లి కావాల్సిన దుస్థితి ప్రాణాంతకంగా మారుతోంది. గర్భంలోనే కొందరు శిశువులు మృతి చెందటం.. మరికొందరు తక్కువ బరువుతో జన్మించడం.. ఎదుగుదల లోపాలు వెంటాడటం.. తల్లి బలహీనత, రక్తహీనత, జన్యుపర వ్యాధుల బారిన పడటం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దంపతుల మధ్య కలహాలు, మానసిక పరిపక్వత లోపించి విపరీత పరిణామాలకు దారితీస్తున్న ఘటనలూ లేకపోలేదు. వీటన్నింటికీ కారణమైన బాల్య వివాహాల పట్ల ఇరు కుటుంబాల వారు ఆలోచించి మంచి నిర్ణయం తీసుకుంటే భవిష్యత్తుకు చక్కటి మార్గదర్శకులు కావొచ్చని మేధావులు చెబుతున్నారు.

- ఉరవకొండ నియోజకవర్గంలోని ఒక గ్రామంలో 14 ఏళ్ల అమ్మాయికి యువకుడు ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పాడు. ప్రేమ, పెళ్లి వ్యవహారంలో తలెత్తిన వివాదం ముదిరి వారం కిందట అమ్మాయి ఇంటి గుమ్మం వద్దే అందరూ చూస్తుండగా తాళి కట్టాడు. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఐసీడీఎస్, బాలల సంరక్షణ సమితి, పోలీస్ అధికారులు హుటాహుటిన బాలిక స్వగ్రామానికి చేరుకుని ఆరా తీశారు. బాల్య వివాహంగా నిర్ధారించి తాళి కట్టిన యువకుడిపై కేసు నమోదు చేశారు.
- గుమ్మఘట్ట మండలం పూలకుంటలో ఇటీవల 15 ఏళ్ల అమ్మాయితో 20 ఏళ్ల అబ్బాయికి వివాహ ఏర్పాట్లు చేపట్టారు. విషయం తెలుసుకున్న అధికారులు పెళ్లికి రెండు రోజుల ముందుగా వెళ్లి అడ్డుకున్నారు.
- గతేడాది చివర్లో రాయదుర్గం మండలంలోని ఓ గ్రామంలో తొమ్మిదో తరగతి చదివే అమ్మాయికి 23 ఏళ్ల అబ్బాయితో వివాహం కుదిర్చారు. పెళ్లి ఏర్పాట్లు పూర్తి చేశారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ అధికారులు పోలీసులతో కలసి సంయుక్తంగా దాడులు చేపట్టారు. బాల్య వివాహం చేస్తే జైలుకు పంపుతామని హెచ్చరించారు.
- శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లిలో 16 ఏళ్ల అమ్మాయితో 22 ఏళ్ల అబ్బాయికి పెళ్లి కుదిరి పీటలదాక వెళ్లింది. ఈ లోపు సమాచారం అందడంతో అధికారులు వెళ్లి అడ్డుకుని, కౌన్సెలింగ్ ఇచ్చారు.
- ఇవి మాత్రమే కాదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి బాల్య వివాహాలను అధికారులు చాలావరకు అడ్డుకున్నారు. బాలికల భవిష్యత్తు నాశనం కాకుండా చర్యలు చేపట్టారు.

చట్టం కఠినతరం..

బాల్యం మూడుముళ్ల బంధానికి బలికాకుండా సీఎం జగన్ చట్టాన్ని కఠినతరం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 18 ఏళ్ల లోపు అమ్మాయిలకు పెళ్లిళ్లు చేస్తే ఎంతటివారైన సరే జైలుకు పంపేలా పోక్సో సవరణ చట్టం అమల్లోకి తెచ్చారు. 18 ఏళ్లలోపు బాలికతో శారీరకంగా కలిస్తే పదేళ్లకు పైగా జైలు శిక్ష, 16 ఏళ్లలోపు వారితో కలిస్తే 20 ఏళ్లకు పైగా శిక్ష వేసేలా కీలక చర్యలు చేపట్టారు. దీనికి తోడు బాల్య వివాహాలను ప్రోత్సహించే తల్లిదండ్రులకు రెండేళ్ల జైలు శిక్ష విధించేలా మార్గదర్శకాలు జారీ చేశారు.

ప్రాణానికే ప్రమాదం



బాల్యం వివాహం ఎన్నో అనర్థాలకు దారి తీస్తుంది. ప్రసవ సమయాన ఎన్నో ఇబ్బందులు ఎదురవుతాయి. వయసును బట్టే గర్భసంచి వృద్ధి చెందే అవకాశం ఉంది. తక్కువ వయసున్నప్పుడే ఒత్తిడి పెంచడం మంచిది కాదు. దాని ప్రభావం వల్ల దీర్ఘకాలికంగా మానసిక వ్యాధులతో సతమతం కావాల్సి వస్తుంది. అవగాహన లోపం కారణంగా నేటికీ కొందరు దురాలోచనకు పాల్పడటం సరైంది కాదు.

– మాధవి, స్త్రీ వైద్య నిపుణురాలు, రాయదుర్గం

తెలిసిన తక్షణమే అడ్డుకుంటున్నాం



బాల్య వివాహాలు చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చిన తక్షణమే వెళ్లి అడ్డుకుంటున్నాం. 1098, డయల్ 100కు కాల్ చేసినా, అంగన్‌వాడీ కార్యకర్తలకు సమాచారం ఇచ్చినా చట్ట ప్రకారం చర్యలు చేపడుతున్నాం. ఉమ్మడి జిల్లాలో గతేడాది చివరి వరకు 1,384 బాల్య వివాహాలను అడ్డుకున్నాం. ఇందులో 1,381 మందిని కుటుంబ సభ్యులకు అప్పగించాం. ముగ్గురిని హోమ్‌లో ఉంచాం.

– శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ

నిబంధనలు కఠినతరం చేస్తాం



బాల్య వివాహాలపై సీఎం జగన్ అమల్లోకి తెచ్చిన నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా కఠిన చర్యలు చేపడతాం. ఇందులో అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసి చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఉక్కుపాదం మోపుతాం. గ్రామ పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలను ఈ విషయంపై మరింత అప్రమత్తం చేస్తాం. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కూడా ముమ్మరం చేయిస్తాం. ఈ దురాచారాన్ని పూర్తిగా రూపుమాపేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలి.

– నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

రెండో విడత వెటర్నరీ అంబులెన్స్‌లు మంజూరు



వైఎస్సార్ సంచార పశువైద్యశాల వాహనం

అనంతపురం అగ్రికల్చర్: పల్లెపల్లెకూ పశువైద్యసేవలు అందించే డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాలలు (మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్) రెండో విడత కింద నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరయ్యాయి. తొలివిడతగా గతేడాది మే 19న నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరైన అత్యాధునిక సదుపాయం కలిగిన సంచార వాహనాలు జిల్లాలో విశిష్ట సేవలు అందిస్తున్నాయి. 108 మాదిరిగా... వెటర్నరీ వాహనాల సేవలు వినియోగించుకునేందుకు 1962 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేస్తే... తక్షణం స్పందించి పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు.. ఇతరత్రా మూగజీవాలకు వైద్యసేవలు అందిస్తున్నాయి. తాజాగా రెండో విడత కింద కింద అనంతపురం జిల్లాకు 6, సత్యసాయి జిల్లాకు 8 వాహనాలు కేటాయించినట్లు పశుశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రమణ్యం 'సాక్షి'కి తెలిపారు. ఈ వాహనాలు గురువారం లేదా శుక్రవారంలోపు చేరుతాయన్నారు. దీంతో ప్రతి నియోజకవర్గానికి రెండు మొబైల్ వెటర్నరీ అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

సమష్టి సహకారంతో పర్యాటక అభివృద్ధి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం కల్చరల్: పర్యాటక ప్రాంతాలు దేశ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడతాయని ఎంపీ తలారి రంగయ్య అన్నారు. జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల వద్ద ర్యాలీని ఎంపీ ప్రారంభించారు. ఎంపీతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, జిల్లా పర్యాటక శాఖాధికారి నాగేశ్వరరెడ్డి తదితరులు మాట్లాడారు. జిల్లాలో ఎన్నో ప్రసిద్ధమైన పర్యాటక ప్రాంతాలున్నాయని, వాటిని అభివృద్ధి దిశగా నడిపించడానికి అందరి సహకారం అవసరమన్నారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఏటా జనవరి 25న జాతీయ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అంతకు ముందు నగరంలో మానవహారంగా ఏర్పడి ప్లకార్డులు చేతపట్టుకుని బుక్కరాయ సముద్రం దేవరకొండ వరకు పర్యాటక క్షేత్రాలకు సంఘీభావంగా ర్యాలీ సాగింది. జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి, రెడ్డి జన సంఘ అధ్యక్షులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇంటాక్ సభ్యులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెల 27న చెన్నైలో ప్రారంభమయ్యే జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఎస్కేయూ మహిళా జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో గాయత్రి, గౌతమి, రమ్యశ్రీ, భవ్య, సుమిత్ర, జ్యోష్న, హేమ, ఎం.గౌతమి, శివాని ఉన్నారు. ఈ ప్రక్రియను వర్సిటీ వీసీ ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి శ్రీనివాసన్, పీడీ శాంత కుమారి పర్యవేక్షించారు. ఎంపికైన క్రీడాకారులను వీసీ రామకృష్ణారెడ్డి అభినందించారు.

ప్రయాణికుల పాట్లు పట్టవా?



షెల్టర్ లేని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం

- మూడు ప్లాట్‌ఫామ్‌లపై ఇబ్బందులు
- రైలు పొడవుకు సరిపడ షెల్టర్లు లేవు
- ఇబ్బందులు పట్టని రైల్వే అధికారులు

గుంతకల్లు: భారతీయ రైల్వేలో ఇంధన పొదుపు చర్యల్లో దక్షిణ మధ్య రైల్వేలోని గుంతకల్లు రైల్వేస్టేషన్ రెండో స్థానం సంపాదించింది. ఈ రైల్వేస్టేషన్ భవనాన్ని విమానాశ్రయంతో పోలుస్తూ రైల్వే మంత్రి స్వయంగా ట్వీట్ చేశారు. అంతటి పేరుగాంచిన ఈ స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లకు అనుగుణంగా షెల్టర్లు లేవు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్లు జంక్షన్ గుండా రోజూ వందకుపైగా ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లలో దాదాపు 15వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. నూతన రైల్వే స్టేషన్ భవనం, ప్లాట్‌ఫాంలు, విశ్రాంతి భవనాలు, ఎస్కలేటర్లు, లిఫ్ట్‌లు తదితర అభివృద్ధి పేరుతో రైల్వే శాఖ దాదాపు రూ.25 కోట్లు ఖర్చు చేసింది. అయితే 1, 6, 7వ ప్లాట్‌ఫామ్‌లలో రైళ్ల పొడవున్నంత మేర షెల్టర్లు నిర్మించలేదు. దీంతో ఇంజిన్‌కు మొదట నిలబడే బోగీలు, చివర నిలబడే బోగీల కోసం ప్రయాణికులు షెల్టర్లు లేని ప్లాట్‌ఫామ్‌లపై వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణంగా ప్రయాణికులు షెల్టర్లు ఉండే చోట వేచి ఉంటారు. రైళ్లు వచ్చినపుడు ఆ బోగీల కోసం అటుగా పరుగుల తీస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలు తమ లగేజీలను ఎత్తుకుని పరుగులు పెడుతున్న సమయంలో కిందపడిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. మరి కొందరు చేసేది లేక ఎండకు ఎండుతూ, వానలకు తడుస్తూనే రైలు ఎక్కుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పై మూడు ప్లాట్‌ఫామ్‌ల వద్ద షెల్టర్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

30, 31 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె

అనంతపురం అగ్రికల్చర్: బ్యాంకు ఉద్యోగుల పట్ల కేంద్ర ప్రభుత్వం, భారత బ్యాంకుల సంఘం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 30, 31న సమ్మె చేపడుతున్నట్లు బ్యాంక్ ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. సమ్మెకు సంఘీభావంగా బుధవారం అనంతపురంలోని కెనరాబ్యాంకు ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు డి.రుష్యేంద్రబాబు, నరేంద్ర, చంద్రశేఖర్, మున్వర్‌బాషా తదితరులు మాట్లాడారు. కేంద్రం అవలంభిస్తున్న విధానాల వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఐదు రోజుల బ్యాంకింగ్ వ్యవస్థ అమలు చేయాలని, విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ సవరించాలని, పనిఒత్తిడిని తగ్గించడానికి ఖాళీలను భర్తీ చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనలో భాగంగా జాతీయ కమిటీల పిలుపు మేరకు ఈ నెల 30, 31తేదీల్లో చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగ సంఘాల నాయకులు రఘునాథరెడ్డి, సంజయ్‌రామ్, మల్లికార్జున, చంద్రమోహన్, శివారెడ్డి, భాస్కర్, బయన్న, భారతి, శైలజ, రేణుక, చరిత, పుష్పవాణి, కుళ్లాయిస్వామి, శ్రీకాంత్, రాథోడ్, చంద్రమౌళి పాల్గొన్నారు.

మీ భవిష్యత్తు నిర్ణయించేది ఓటు

- ప్రజల కోసం పనిచేసే నాయకుడిని ఎన్నుకోవాలి
- ఓటర్ల దినోత్సవంలో జేసీ కేతన్‌గార్గ్ పిలుపు



ఓటరు కార్డు అందజేస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: 'ఓటు.. ఒక కార్డు కాదు. అది మీ భవిష్యత్తు. ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించి ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకుడిని ఎన్నుకోవాలి. అప్పుడే ఓటు విలువ.. ఔన్నత్యం పెరుగుతుంది' అని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఎన్నికల విభాగం నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యయంలో ఓటు చాలా శక్తివంతమైన ఆయుధమన్నారు. ఓటు దేశం, ప్రజల భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు. ఒక మంచి పాలకుడిని ఎన్నుకునే అవకాశం ఓటు ద్వారా లభిస్తుందన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ఓటు గురించి విద్యార్థులను నాలుగు ప్రశ్నలు అడిగి సమాధానం చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. ఓటర్లతో ఆర్డీఓ మధుసూదన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓ) ఆర్డీఓలు నిషాంత్‌రెడ్డి, రవీంద్ర, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ సీఈఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానం

ఓటరు జాబితా సవరణలో ఉత్తమ పనితీరు కనబర్చిన అధికారులు, సిబ్బందికి జాయింట్ కలెక్టర్ అవార్డులు ప్రదానం చేశారు. రాయదుర్గం ఈఆర్ఓ కేశవనాయుడు, కళ్యాణదుర్గం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్‌తో పాటు 18 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు అవార్డులు అందజేశారు.

GROUP-II | S.I
సచివాలయ ఉద్యోగాలు

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన బాలికల జట్టుతో నిర్వాహకులు

పరిగి: ఈ నెల 29 నుంచి కర్నూలు జిల్లా నందికొట్కూరులో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. పరిగిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఈ ఎంపికలు జరిగాయి. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో 12 జట్లుగా క్రీడాకారులను విభజించి పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 48 మంది బాలబాలికలను రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జట్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీడీ ప్రకాష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సత్యకృపారాజు, ఎస్జీఎఫ్ పరిశీలకుడు మొరార్జీయాదవ్, వివిధ పాఠశాలల పీడీలు, సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

రేపు మాజీ సైనికులు, వితంతువుల పింఛన్ పరిష్కార వేదిక

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మాజీ సైనికులు, వితంతువుల ఎదుర్కొంటున్న పింఛన్ సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 27న అనంతపురంలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో వేదిక ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు మాజీ సైనిక సంక్షేమ శాఖ అధికారి రాచయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మద్రాస్ రెజిమెంట్‌కు సంబంధించిన మాజీ సైనికులు, వితంతువులు మాత్రమే పెన్షన్ సమస్యలపై తగిన ఆధారాలు తీసుకువచ్చి సంప్రదించాలని సూచించారు. పెన్షన్ పేమెంట్ ఆర్డరు, డిశ్చార్జ్ బుక్, అప్డేట్ బ్యాంకు పెన్షన్ పాసుపుస్తకంతో హాజరుకావాలని పేర్కొన్నారు.

ఎందరో వీరుల త్యాగఫలం

స్వాతంత్ర్య పోరాటంలో ఆసేతు హిమాచలం కదలివచ్చి సమరోత్సాహంతో తెల్లదొరల భరతం పట్టిన వారిలో అనంత వాసుల భాగస్వామ్యమూ ఉంది. తరాలు గడిచినా ఆ మహనీయుల వారసులు నేటికీ వారి జ్ఞాపకాలను పదిలంగా చూసుకుంటున్నారు. వారి ఆశయాలను సజీవంగా ఉంచేందుకు వివిధ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వాడవాడలా దేశభక్తిని చాటేలా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడనున్నాయి. ఇలాంటి తరుణంలో త్యాగధనుల జ్ఞాపకాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం. - అనంతపురం కల్చరల్

సందర్భం - నేడు గణతంత్ర దినోత్సవం

అఖండ భరతావని స్వేచ్ఛా వాయువులు పీల్చుకుని, త్రివర్ణ పతాకం రెపరెపలాడిన ఆనందక్షణాలకు తీపి గుర్తుగా, నాటి దేశభక్తుల త్యాగాలకు చిహ్నంగా అనంతపురం నగర నడిబొడ్డున టవర్ క్లాక్ వెలిసింది. అమరవీరుల త్యాగాలకు గుర్తుగా నిర్మించిన ఈ కట్టడాన్ని సంపూర్ణ స్వాతంత్ర్యానంతరం 1952లో దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు. దేశం కోసం సర్వమూ త్యాగం చేసిన పోరాట వీరుల గుండె చప్పుడు ప్రతిక్షణం వినబడేలా కట్టడంపై గడియారాన్ని ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవానికి (15.8.47) గుర్తుగా 15 అడుగుల వెడల్పు, 8 భుజాలు, 47 అడుగుల ఎత్తు ఉండేటట్లు నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు.



విద్యుత్ వెలుగులలో క్లాక్ టవర్

చిరుప్రాయంలోనే స్వేచ్ఛానినాదం



అనంతపురానికి చెందిన వరదరాజుల రాజ్యలక్ష్మి చిరుప్రాయంలోనే తన తండ్రి ఆర్.రంగస్వామి అయ్యంగార్ వెంట తిరుగుతూ స్వాతంత్ర్య సమరాన్ని కళ్లారా చూశారు. ఆ రోజులను గుర్తు చేసుకుంటే నేటికీ ఎంతో ఉద్వేగానికి లోనవుతారు. 'మా నాన్న వాళ్ల చిన్నప్పుడే తమిళనాడు నుంచి బళ్లారికి వచ్చేశారు. అప్పుడు అనంతపురం.. బళ్లారిలో అంతర్భాగంగా ఉండేది. స్వతంత్ర భారతావని తొలి గవర్నర్ జనరల్ రాజాజీకి నా భర్త వరదరాజ చక్రవర్తి సమీప బంధువు. ఊహ తెలుస్తున్న రోజుల్లోనే తెల్లవారికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో బ్రిటీష్ వారి ఆగ్రహాన్ని చవిచూడాల్సి వచ్చింది. దేశభక్తుడు కల్లూరు రాధాకృష్ణను జైలులో నిర్బంధించినప్పుడు ఆయన విడుదల కోసం మా స్నేహితులతో కలసి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి, నిరసన వ్యక్తం చేశాం. నా చిన్నప్పుడే గాంధీజీ, నెహ్రూతో పాటూ అప్పటి బ్రిటీష్ వైస్రాయ్ సర్ మౌంట్‌బాటన్‌ను అతి దగ్గరగా చూశాను' అని చెప్పే రాజ్యలక్ష్మి.. తొమ్మిది పదుల వయసులోనూ ఎంతో ఉత్సాహంగా ఉన్నారు.


నాన్న ఆశయ స్ఫూర్తితో..



ఉమ్మడి అనంత జిల్లాలోని కదిరికి సమీపంలోని ముత్యాలచెరువు గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీకాంతం శ్యామమూర్తి ఇటీవలే మరణించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నా.. జీవిత చరమాంకంలో అనంతపురంలో ఉంటున్న రెండో కుమారుడు శ్రీకాంతం సుబ్బారావు వద్ద ఉండేవారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నాటి జ్ఞాపకాలను సుబ్బారావు దంపతులు 'సాక్షి'తో పంచుకున్నారు. 'దేశమాత దాస్యశృంఖలాలు తెంచడం ఎంత ముఖ్యమో.. అందరి ఆకలి తీర్చడం అంతే ప్రధానమని మా నాన్న చెబుతుండేవారు. స్వాతంత్ర్య పోరాటంలో తెల్లవారికి వ్యతిరేకంగా దొన్నికోట వద్ద బ్రిటీష్ బంగ్లాను కాల్చేసిన ఘటనలో ఆయన జైలుకు వెళ్లారు. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వంతో తామ్రపత్రం కూడా అందుకున్నారు. నేనైతే నాటి విశేషాలను కళ్లారా చూడలేదు కానీ, ఆయన మాత్రం నిత్యమూ మాతో స్వాతంత్ర్య ఉద్యమం సాగిన తీరునే వివరించి చెప్పేవారు. ప్రస్తుతం మా నాన్న మన మధ్య లేకపోయినా.. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ అన్నదాన ట్రస్టును ఏర్పాటు చేశాను. అందరి సహకారంతో అన్నదానం చేస్తున్నాం. పదిమంది ఆకలి తీర్చినప్పుడల్లా మాకు నాన్న సజీవంగా ఉన్నారనిపిస్తుంది'

లోకేష్ పాదయాత్రతో ఒరిగేదేం లేదు

- ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి



అనంతపురం క్రైం: స్పష్టమైన అజెండా లేని నారా లోకేష్ పాదయాత్రతో ఒరిగేదేం లేదని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పాదయాత్ర చూసి ప్రజాభిమానం మూటగట్టుకోవచ్చనన్న ఆశతో నారా లోకేష్ పాదయాత్రకు సిద్ధమయ్యాడని, అయితే నెమలి ఈకలు పెట్టుకున్నంత మాత్రాన కాకి ఎన్నటికీ నెమలి కాలేదనే సత్యాన్ని గ్రహించాలని హితవు పలికారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఒక అడుగు ముందుకువేస్తే.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు అడుగులు ముందుకు వేస్తూ.. ప్రతి గడపలో సంతోషాన్ని నింపుతున్నారన్నారు. ఈ పాలన ఇలాగే కొనసాగితే తమకు భవిష్యత్తు ఉండదనే భయంతో ప్రతిపక్షాలు కుట్రలు సాగిస్తున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ఒకేసారి 1.25 లక్షలకు పైగా యువతకు ఉద్యోగాలందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు వల్ల ప్రజలకు చేకూరిన మంచి ఏదీ లేదన్నారు. అధికార కాంక్ష తప్ప ప్రజా సంక్షేమానికి స్పష్టమైన ప్రణాళిక కూడా చంద్రబాబు, లోకేష్ వద్ద లేదన్నారు.

పప్పునాయుడికి అంత సీన్ లేదు

- ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు



కూడేరులో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ (చిత్రంలో) మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

కూడేరు: పప్పునాయుడు నారా లోకేష్ బాబు చేపట్టే పాదయాత్రతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని, కేవలం ప్రజల్లో ఇమేజ్ పెంచేందుకు ఎల్లోమీడియా తప్పుడు కథనాలు ప్రచురిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. రాజకీయాల్లో లోకేష్‌కు అంత సీన్ లేదని అన్నారు. బుధవారం కూడేరు మండలం ఎంఎంహళ్లిలో పర్యటించిన వారు స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ఎన్ని సభలు నిర్వహించినా, పవన్ కళ్యాణ్ ఎన్ని వారాహి యాత్రలు చేసినా 2024 ఎన్నికల్లో ప్రజా మద్దతు పూర్తిగా వైఎస్సార్‌సీపీకే ఉంటుందన్నారు. 175 స్థానాలు కైవసం చేసుకుంటామని సీఎం జగన్ చెప్పడంతో చంద్రబాబులో వణుకు పుట్టిందన్నారు. దీంతో తన దత్తపుత్రుడు పవన్‌తో పొత్తులకు పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. వెండి తెరపై హీరోగా కనిపించే పవన్‌కళ్యాణ్.. రాజకీయంగా జీరోగా మిగిలాడన్నారు. అన్ని స్థానాల్లో పోటీ చేయలేని జనసేన పార్టీని అధికారంలోకి తీసుకువస్తామని పవన్‌కళ్యాణ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీని, జనసేనను ప్రజలు ఛీకొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. సమావేశంలో ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు తుప్పటి హరీష్, బైరెడ్డి రామచంద్రారెడ్డి, ఆదినారాయణ, తిమ్మరాయుడు పాల్గొన్నారు.

బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

- అక్కినేని నాగార్జున అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్

అనంతపురం టవర్‌క్లాక్: అక్కినేని నాగేశ్వరరావుని కించపరిచేలా మాట్లాడిన సినీ హీరో బాలకృష్ణ తక్షణమే అక్కినేని అభిమానులకు క్షమాపణ చెప్పాలని అక్కినేని నాగార్జున అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్ డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరసింహారెడ్డి సినిమా విజయోత్సవం సభలో బాలకృష్ణ మాట్లాడుతూ.. అక్కినేని నాగేశ్వరరావు, ఎస్వీ రంగారావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. సినిమా పరిశ్రమలను మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చిన ఘనత అక్కినేని నాగేశ్వరరావుకు దక్కుతుందన్నారు. సమావేశంలో రమేష్, జోసెఫ్, అలీ, నాగరాజు, గోపాల్, గోవిందరాజులు, ఆదినారాయణ, వెంకటేష్, షరీఫ్, ఏఎస్ఆర్ షఫీ, అనిల్, బాలు, వెంకట్, గౌతమ్, నరసింహ పాల్గొన్నారు.

కొప్పలకొండలో నీతి అయోగ్ సభ్యుల పర్యటన



హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న నీతి అయోగ్ కమిటీ సభ్యులు

గార్లదిన్నె: మండలంలోని కొప్పలకొండ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను నీతి అయోగ్ కమిటీ సభ్యులు డాక్టర్ సుమన అరోరా, మిత్రా, శ్రేష్ఠాహజ్రా బుధవారం పరిశీలించారు. రక్తపోటు, చక్కెర వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు రక్త పరీక్షలు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లో కల్పించిన సదుపాయాలు, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయ్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, డాక్టర్లు సుబ్రహ్మణ్యం, నారాయణస్వామి, చెన్నకేశవులు, సుజాత, మండల వైద్యాధికారి గౌతమి, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాల లబ్ధిపై ఆరా

కూడేరు: కమ్మూరులో కేంద్ర బృందం సభ్యులు సంతోష్ ప్రదాన్, ప్రదీప్‌పైక్రాయ్ బుధవారం పర్యటించారు. మండల అధికారులతో సమావేశమై కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏఏ అభివృద్ధి పనులు చేపట్టింది తెలుసుకున్నారు. ఎంత మేరకు రుణ సదుపాయం కల్పించారని ఆరా తీశారు. వాటికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. తర్వాత లబ్ధిదారులతో మాట్లాడారు.

యంత్ర పరికరాలు తక్కువ ధరకు ఇవ్వాలి

- జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

అనంతపురం అర్బన్: వ్యవసాయ యంత్ర పరికరాలను సాధ్యమైనంత మేర తక్కువ ధరతో రైతులకు అందించాలని సంబంధిత డీలర్లకు జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచించారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి ధరల పర్యవేక్షణ కమిటీ (డీపీఎంసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతు భరోసా కేంద్రం ద్వారా అందించే వ్యవసాయ యంత్ర పరికరాల ధరలను డీపీఎంసీ ద్వారా నిర్ణయించామన్నారు. ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్, ఇతర వ్యవసాయ పనిముట్లు విక్రయించే డీలర్లు వాటి ధరల వివరాలను మార్కెట్ ధరలతో సరిచూశామన్నారు. సాధ్యమైనంత మేర తక్కువ ధరతో రైతులకు రాయితీపై పరికరాలను సరఫరా చేయాలని సూచించారు. డీలర్లు తాము అందించేందుకు సాధ్యమయ్యే ధరలను కమిటీకి తెలియజేశారు. దీనిపై జేడీఏ మాట్లాడుతూ ధరల వివరాలను జాయింట్ కలెక్టర్ అనుమతితో వ్యవసాయ కమిషనర్ కార్యాలయానికి పంపిస్తామన్నారు. సమావేశంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ఎఫ్ఎం డీలర్లు పాల్గొన్నారు.

రిమాండ్‌కు 11 మంది

రాయదుర్గం రూరల్: మెచ్చిరి గ్రామంలో గత గురువారం చోటు చేసుకున్న ఇరువర్గాల ఘర్షణలో 11 మందిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు. పోరంబోకు స్థల విషయమై ఇరువర్గాల వారు కర్రలు, మచ్చుకత్తులు, గొడ్డళ్లతో దాడులకు పాల్పడ్డారన్నారు. ఈ ఘటనలో కృష్ణారెడ్డి, శివారెడ్డి తదితర పది మంది గాయపడ్డారన్నారు. దాడులకు పాల్పడిన గొల్ల భీమప్ప, కిష్టప్ప, చిన్న రంగప్ప కుమారుడు శివణ్ణ, బసవరాజు, మల్లికార్జున, విఠల్, శ్రీకాంత్, చిన్న తిప్పేస్వామి, ఆదికేశవులు, మారెన్న, పెద్ద తిప్పేస్వామిపై కేసు నమోదు చేసి, బుధవారం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపామన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION

■ కమలేసాయి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా UG కోర్స్ BA, B.Com, B.Sc., B.Li.Sc) & PG కోర్స్ (M.A., M.Com, M.Sc, MBA, M.Li.Sc) & Open 10th & Inter & B.Ed అడ్మిషన్స్. సప్తగిరి సర్కిల్, ATP. ఫోన్: 83282 79245 [V- 5614]

REAL ESTATE

PLOT FOR SALE

■ HIGHWAY COUNTY, Beside APS Warehousing Godowns, near SVIT, NH 44, AHUDA approved plots for sale. 9392183377, 9281024684, 9391756322. [A-299]

■ GREEN COUNTY, Rapthadu, NH 44, AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-298]

■ GMR COLONY, Alamuru Road, Anantapur. AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-297]

EMI పద్ధతిలో ప్లాట్లు

■ S.K. యూనివర్శిటీ దగ్గర, EMI పద్ధతిలో డెవలప్‌మెంట్స్‌తో తక్కువ ధరల్లో కమర్షియల్ / రెసిడెన్షియల్ ప్లాట్లు కలవు. వెంటనే సంప్ర: 9642999578, 9642999005. [A-752490]

TOLET/ COMMERICIAL

■ JNTU కాలేజీరోడ్డు ATP, సూపర్‌స్పెషాలిటీ దగ్గర బ్లడ్‌బ్యాంక్ ఎదురుగా ఉన్న 2 షాపులు బాడుగకు ఇవ్వబడును. డాక్టర్స్/ మెడికల్ షాపులకు అనుకూలం. సంప్ర: 9866457671 [G-5957]

SERVICES

ఫంక్షన్ హాల్ బాడుగకు

■ ATP, సంఘమేష్ నగర్, Opp. GST ఆఫీస్, శ్రీ సాయి విశ్వేశ్వర కమ్యూనిటీ హాల్ - వివాహములకు బర్త్‌డే, నామకరణం, శ్రీమంతం, ఫంక్షన్స్ శుభకార్యాలకు బాడుగకు ఇవ్వబడును. 8985322907. [A-752488]

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్, బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు వున్నవి, మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. 73821 14647 [V- 6048]

BUSINESS OFFER

■ ఒక సరైయిన రోజువారి ఆదాయ అవకాశం. కేవలం అతి తక్కువ పెట్టుబడితో ఒక మంచి ప్రయత్నం ఇప్పుడే ప్రారంభించండి. Dont Miss. సంప్ర॥ 7793987988 [G-776147]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779856]

■ ప్రముఖ బ్యాంక్ నందు పని చేయుటకు డిగ్రీ అర్హత కల CSO, క్లర్క్, క్యాషియర్, బ్యాంక్ ఆఫీసర్ అర్జెంటుగా కావలెను. (M/F) ఒరిజినల్ సర్టిఫికేట్‌తో సంప్ర: 9963877988, 81429 06890. [NA-10424]

■ షిర్డీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-10046]

■ డైరెక్ట్ జాబ్! Hyd లో 5స్టార్ హోటల్స్ లో క్యాటరింగ్ బాయ్స్ పరిశ్రమలలో ప్యాకింగ్ బాయ్స్ సాలరీ: 25-35వేలు, రూమ్+ మీల్స్ కలదు. ఫోన్ : 9542442263. [H-792786]

■ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఫార్మాకంపెనీలో సెక్యూరిటీ సూపర్ వైజర్ కావలెను. 16000/- ఉచిత వసతి భోజనం Cont: 6300661014 [HA-868]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

4 లైన్లు రూ. 270/-
అదనపు లైను రూ. 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307, 9010588846, 9243295650
DHARMAVARAM : 9912220726, 9912220727
HINDUPUR : 9912220723, 9705346587
GUNTAKAL : 9010223701
TADIPATRI : 9912220722
MADAKASIRA : 9010200238
KADIRI : 9010593486
RAYADURG : 9010470185

■ అనంతపురములో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మేనేజర్స్ కావలెను. సెల్ : 9114949999. [A-262]

■ రాధ బొటిక్, రామ్ నగర్, అనంతపురం నందు పనిచేయుటకు అన్ని డిజైన్స్ బ్లౌజెస్, లెహంగాస్, ఫ్రాక్స్ కుట్ట గల వర్కర్ కావలెను. సెల్ :9490624532, 8522930552. [A-752489]

■ ATP ప్రముఖ కంపెనీ నందు పనిచేయుటకు టెలికాలర్స్ (F) Q: 10th or Inter, Software Project నందు పనిచేయుటకు (M/F) Q: Any డిగ్రీ. Well Communications in English. Cont: 9000401967. [A-287]

■ అనంతపురము జిల్లాలో గల గ్రామీణ ప్రాంతాల వారికి మా కంపెనీలో 18 మంది స్త్రీ/పు లకు ఉద్యోగాలు. జీతం : 14,000 + బోనస్ 5000 + రూమ్, ఫుడ్ ఫ్రీ (నో ఫీజు). అర్హత : SSC / డిగ్రీ (పాస్/ఫెయిల్), సాయినగర్, 8వ క్రాస్, అనంతపురము. సెల్ : 9502400350. [A-7616]

■ లేడీ టెలికాలర్స్ (జీతం : 8 వేలు - 10 వేలు) & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (బాయ్స్) Q: MBA, జీతం : 25 వేలు - 30 వేలు. వర్కింగ్ ప్లేస్ : అనంతపురము, ధర్మవరం, తాడిపత్రి, గుత్తి, గుంతకల్, హిందూపురం, పుట్టపర్తి, కదిరి, రాయదుర్గం, కళ్యాణదుర్గం (స్థానికులకు ప్రాధాన్యత) 7013065782, 9493367904 [A-752487]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పప్పు.. ఎప్పటికీ నిప్పు కాలేడు

- ఫెయిల్యూర్ క్యాండిడేట్ పాదయాత్రతో ఒరిగేదేమీ లేదు
- అధికారంలో ఉన్నప్పుడు యువతను నిండాముంచాడు
- క్షమాపణ చెప్పిన తర్వాతనే జనంలోకి రావాలి
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడు రూరల్: అధికారంలో ఉన్నప్పుడు యువత గొంతు నొక్కి ఇప్పుడేమో యువగళం పేరుతో వస్తున్న పప్పు (నారా లోకేష్) ఎప్పటికీ నిప్పు కాలేడని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు అవుట్‌డేట్ క్యాండిడేట్ కాగా, లోకేష్ ఫెయిల్యూర్ క్యాండిడేట్ అని విమర్శించారు. బుధవారం అనంతపురం మండలం సిండికేట్ నగర్ పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2014 ఎన్నికలకు ముందు ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత యువతను నిలువునా మోసగించిన తీరును నేటికీ ఎవరూ మరవలేదన్నారు. ఎన్టీఆర్, టీడీపీ, ఆ పార్టీ కార్యకర్తలకు చేసిన ద్రోహంపై ఆత్మ విమర్శ చేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతనే జనంలోకి రావాలని సూచించారు. లోకేష్ గతంలో హిందూపురం నుంచి సైకిల్‌యాత్ర చేపట్టి 30 కిలోమీటర్ల ప్రయాణం చేసేందుకు 3 రోజులు సమయం తీసుకున్నాడని, ఆ తర్వాత తన వల్ల కాదని చేతులెత్తేశాడని గుర్తు చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడలేదు కాబట్టి లోకేష్‌కు నాయకుడిగా చెలామణి అయ్యే అర్హత కూడా లేదన్నారు.

ప్రతిపక్ష నేతగా నాడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్రలో కిలోమీటర్ల పొడవునా లక్షలాది మంది జనం కనిపించారన్నారు. ఇదే స్థాయిలో జనాన్ని చూపించాలనే ఆలోచనతో పదివేల మందిని పోగేసి చంద్రబాబు ఆర్భాటాలకు పోయి ప్రజల ప్రాణాలు బలిగొంటున్నాడని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు పుష్కరాలకు వెళ్లి 29 మందిని బలిగొన్నారని, ప్రతిపక్ష నేతగా ఇటీవల మరో 11 మంది మృతికి కారకుడయ్యాడని తెలిపారు.

సభలు, సమావేశాలు నిర్వహణకు ప్రభుత్వం వ్యతిరేకం కాదన్నారు. అయితే నిబంధనలకు లోబడి నిర్వహించుకోవడం నిర్వాహకుల ధర్మమన్నారు. కేవలం నిబంధనలు అతిక్రమించడం వల్లనే కందుకూరు, గుంటూరులో సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్న విషయం గుర్తించాలన్నారు. ఈ క్రమంలోనే మరిన్ని ప్రాణాలు పోకూడదనే ఉద్దేశంతో నిబంధనలకు లోబడి సభలు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం చెబుతోందన్నారు. ఈ విషయాన్ని వక్రీకరిస్తూ ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం సాగిస్తోందని మండిపడ్డారు.

సీఎం వైఎస్ జగన్‌తో పోల్చుకునే అర్హత లోకేష్‌కు లేదన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ.లక్షలు అందజేసిన మహోన్నత వ్యక్తిగా సీఎం వైఎస్ జగన్ ఖ్యాతి గడించారన్నారు. పేదల సంక్షేమం వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందని విశ్వసించిన ప్రజలు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారన్నారు. రాబోవు ఎన్నికల తర్వాత టీడీపీ కనుమరుగవడం ఖాయమన్నారు.

రూ.లక్ష డిపాజిట్ చేస్తే రోజుకు వెయ్యి!

- వ్యాపారి మాట నమ్మి భారీగా డిపాజిట్లు
- రూ.2.5 కోట్లతో పరారైన వడ్డీ వ్యాపారి
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

సోమందేపల్లి: రూ.లక్ష డిపాజిట్ చేస్తే రోజుకు రూ.వెయ్యి ఇస్తానని ఓ వ్యక్తి చెప్పగా..అధిక వడ్డీకి ఆశపడిన జనం భారీగా సమర్పించుకున్నారు. అంతా సర్దుకుని సదరు వ్యాపారి పరారుకాగా, తాము మోసపోయామని బాధితులు పోలీస్ స్టేషన్ మెట్లెక్కారు. వివరాల్లోకి వెళితే...సోమందేపల్లిలోని చికెన్‌రెడ్డి కాంప్లెక్స్‌లో మనోహర్‌రెడ్డి అనే వ్యక్తి వడ్డీ వ్యాపారం పేరిట కార్యాలయం తెరిచాడు. తనకు చక్కెర పరిశ్రమతోపాటు సిగరెట్ కంపెనీల్లో షేర్లు ఉన్నాయని, వాటి ద్వారా వచ్చే ఆదాయంపై ఇన్‌కం ట్యాక్స్‌కు కడుతున్నానని, ఇప్పటి నుంచి ప్రజలకే ఇవ్వాలనుకుంటున్నట్లు అందరినీ నమ్మించాడు. అయితే ఇందుకు తన వద్ద రూ.లక్ష డిపాజిట్ చేస్తే రోజూ రూ.1000 ఇస్తానని ఆశపెట్టాడు. అతని డాబు, దర్పం చూసి జనం బాగా నమ్మారు. నెల రోజులుగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు రూ.లక్షలు అతని వద్ద డిపాజిట్లు చేశారు. చెప్పిన ప్రకారం కొద్దిరోజుల పాటు కొందరికి రోజూ వారీ వడ్డీ చెల్లించాడు. దీంతో వారు తమకు తెలిసిన వారితో కూడా రూ.50 వేలు నుంచి రూ.3 లక్షల వరకు డిపాజిట్ చేయించారు. అయితే మనోహర్‌రెడ్డి పదిరోజులుగా ఎవరికీ వడ్డీ డబ్బు చెల్లించకపోవడంతో అప్రమత్తమైన డిపాజిట్ దారులు మంగళవారం అతన్ని నిలదీశారు. తాము కట్టిన డబ్బులు వెనక్కి ఇవ్వాలని కోరారు. దీంతో తన బండారం బయట పడిందని భావించిన మనోహర్‌రెడ్డి కార్యాలయానికి తాళాలు వేసి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో తాము మోసపోయామని భావించి బాధితులు బుధవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు ఏడుగురు బాధితులు రూ.1.7 కోట్లు డిపాజిట్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల్లో మరి కొంతమంది ఉద్యోగులు, ప్రముఖులు ఉండగా కేసు పెట్టేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మొత్తంగా రూ.2.50 కోట్లు మనోహర్‌రెడ్డి స్వాహా చేసినట్లు బాధితులు చెబుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

ప్రభుత్వ సర్వజనాసుపత్రి కార్యాలయము, అనంతపురము.

Rc.No. 62/టెండరు/E1/2023 **టెండరు ప్రకటన** తేది : 25-01-2023

అనంతపురము ప్రభుత్వ సర్వజనాసుపత్రి నందు రోగులకు మరియు డ్యూటీ వైద్యులకు డైట్ (ఆహారం) సరఫరా చేయుటకు టెండరు దరఖాస్తులు కోరడమైనది.

అనంతపురము ప్రభుత్వ సర్వజనాసుపత్రి నందు రోగులకు మరియు డ్యూటీ వైద్యులకు రెండు సంవత్సరముల కాలపరిమితికి ఆహారం సరఫరా చేయుటకు అర్హత గల వారి నుండి దరఖాస్తులు కోరడమైనది. టెండరు దరఖాస్తులు సూపరింటెండెంట్ ప్రభుత్వ సర్వజనాసుపత్రి అనంతపురము వారి కార్యాలయములో 27-01-2023 నుండి 04-02-2023 వరకు ఉదయము 10-30 గంటల నుండి సాయంత్రం 5-00 గంటల లోపల పొందగలరు. నిబంధనలు మరియు ఇతర వివరములకు https://ananthapuramu.ap.gov.in [Notices & Tenders] వెబ్‌సైట్ నందు చూడగలరు.

సం/- శ్రీ కేతన్ గార్గ్, IAS, జాయింట్ కలెక్టర్ / చైర్మన్, జిల్లా డైట్ మేనేజ్‌మెంట్ కమిటీ, అనంతపురము

వైద్య మరియు ఆరోగ్య శాఖ

జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి వారి కార్యాలయము : అనంతపురము.

ఆ.శ.సంఖ్య డైట్/ఎ1/డి.సి.హెచ్.ఎస్/23 తేది :25-01-2023

షార్ట్ టెండర్

గవర్నమెంట్ ఉత్తర్వుల నెం.309 హెచ్.ఎం. అండ్ ఎఫ్.డబ్ల్యు డిపార్ట్, తేది 20-01-2023 (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు ఆసుపత్రులలో రోగులకు డైట్ చార్జీస్ రూ. 40-00 నుండి రూ. 80-00 మరియు డ్యూటీ డాక్టర్లకు రూ. 80-00 నుండి 100-00 లకు పెంచినందున ఇప్పుడు అమలవుతున్న డైట్ కాంట్రాక్టర్లను రద్దు చేస్తూ నోటీసులను జారీచేయడమైనది). తదుపరి జాయింట్ కలెక్టర్, అనంతపురము వారి ఆదేశాల ప్రకారము జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి వారి ఆధ్వర్యంలో గల ఈ క్రింద పేర్కొనబడిన (22) ఎ.పి.వి.వి.పి. ఆసుపత్రులలో గల రోగులకు, డ్యూటీ డాక్టర్లకు భోజన సరఫరా చేయుటకు ప్రావీణ్యం గల కాంట్రాక్టర్ / సరఫరాదారుల నుండి రెండు (2) సంవత్సరాల కాలపరిమితి కొరకు సీల్డ్ టెండర్లు కోరడమైనది.

1. జిల్లా ఆసుపత్రులు (200 పడకలు), హిందూపురం. 2) ఏరియా ఆసుపత్రులు (100) కదిరి, గుంతకల్, మడకశిర, ధర్మవరం, రాయదుర్గం, తాడిపత్రి (3) చైల్డ్ కేర్ హాస్పిటల్ (60) (4) కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (50) పెనుకొండ, ఉరవకొండ, గుత్తి, కళ్యాణదుర్గం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (30) నల్లమాడ, [illegible], [illegible], తనకల్లు, కదిరి, [illegible], [illegible], పి.కె.పల్లి, [illegible], గోరంట్ల.
2. టెండర్ ఫారం వ్యాల్యూతో రూ. 2000/-ను ఏదైనా జాతీయ బ్యాంకు నుండి జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి, అనంతపురము. (Dist. Coordinator Hospital Services, Ananthapuramu) పేరు మీద చెల్లుబాటు అగునట్లు తీసుకొని జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి వారి కార్యాలయం, Govt. General Hospital Compound, అనంతపురము లో బ్యాంకు డ్రాఫ్ట్ సమర్పించి తేది 28-01-2023 నుండి 04-02-2023 వరకు టెండర్ ఫారం కార్యాలయ పనివేళలలో పొందవచ్చును. పూర్తి వివరాలకు www.ananthapuram.ap.gov.in వెబ్‌సైట్ లో చూడవలెను. అనివార్య కారణాల వలన టెండర్లు పాక్షికంగాను లేదా పూర్తిగా రద్దు చేయు అధికారం జిల్లా డైట్ మేనేజ్‌మెంట్ కమిటీకి కలదు. పూర్తి చేసిన టెండర్లు తేది : 04-02-2023 సాయంత్రం 5 గంటల లోపు జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి, కార్యాలయములో దాఖలు పరచవలెను.

Sd/- Dist. Corordinator of Hospital Services, Anantapuramu

క్లుప్తంగా

వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో వైస్సార్ టీఎఫ్ క్యాలెండర్లను ఆ సంఘం మండల అధ్యక్షుడు జయరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందరెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, వైఎస్‌ఆర్‌టీఎఫ్ నాయకులు లింగారెడ్డి, నాగభూషణ, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి

అనంతపురం రూరల్: ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–17 కబడ్డీ పోటీల్లో బీసీ బాలికల వసతి గృహం విద్యార్థినులు సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి, సూపరింటెండెంట్ నాగరత్నమ్మ అభినందించారు. కుష్బూకొఠారి మాట్లాడుతూ విద్యార్థినులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణించి పతకాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీసీ డబ్ల్యూఓ సుభాషిణి, వార్డెన్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

రాప్తాడు: అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన కొప్పల కొండ చినరాయుడు మద్యాన్ని అక్రమంగా తీసుకొచ్చి గ్రామంలో అమ్ముతున్నాడని గ్రామస్తుల ద్వారా ఫిర్యాదు అందినట్లు చెప్పారు. 29 మద్యం బాటిళ్లతో పాటు చినరాయుడును అరెస్ట్ చేశామన్నారు.

అంధ విద్యార్థులకు 'అమ్మ' చేయూత



అంధ విద్యార్థులకు సాయమందిస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: కుందుర్పి మండలానికి చెందిన భీష్మ, కుళ్లాయప్ప, కదిరప్ప,తిమ్మరాజు, ఆంజనేయులు పుట్టుకతోనే అంధులు. తల్లిదండ్రులు పేదలు కావడంతో చదువులను అర్థాంతరంగా ముగించాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న స్థానిక అమ్మ సంస్థ నిర్వాహకుడు రమణారెడ్డి వారికి తలా రూ.3 వేల చొప్పున ఇవ్వడమే కాకుండా రూ.10 వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులు, మరో రూ.10 వేలతో బ్లైండ్ స్టిక్స్ అందించారు. బుధవారం స్థానిక సంస్థ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధులుగా జన్మించినంత మాత్రాన చదువు ఆగిపోకూడదని, ఉన్నత చదువులకు సైతం చేయూతనిస్తానని భరోసా ఇచ్చారు.

స్కిల్ ల్యాబ్ ప్రారంభం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓడీ రామస్వామి నాయక్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో జనరల్ సర్జరీ విభాగంలోని వైద్య విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ల్యాప్రోస్కోపిక్ స్కిల్ ల్యాబ్‌ను బుధవారం ప్రారంభించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ, జనరల్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ రామస్వామి నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రూ. 1.50 లక్షలతో ల్యాబ్ ఏర్పాటు చేశారన్నారు. వైద్య విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ల్యాప్రోస్కోపిక్ విధానంలో శస్త్రచికిత్సలను సులువుగా చేయవచ్చన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు అనంత మెడికల్ కళాశాలలో విద్యనభ్యసించేందుకు ఆసక్తి చూపేందుకు ఇలాంటివి ఉపయోగపడతాయన్నారు. టీవీ ద్వారా చూసి వైద్యం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివశంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ ఒడి'తో సాఫీగా చదువులు

- 'గడపగడప'లో లబ్ధిదారుల ఆనందం



ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు తెలియజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: 'పిల్లల చదువులకు పైసా భారం పడకుండా అన్నీ ఉచితంగా ఇచ్చారు. అమ్మఒడి ద్వారా వచ్చే డబ్బు పిల్లలకే వాడుతున్నాం. జగనన్న కారణంగా మా పిల్లల చదువులు సాఫీగా సాగుతున్నాయి' అంటూ భవాని అనే మహిళ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో సంతోషం వ్యక్తం చేసింది. 39వ డివిజన్‌లోని వడ్డే కాలనీలో బుధవారం వైఎస్సార్ సీపీ నేత చింతకుంట మధుతో కలసి ఎమ్మెల్యే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళ భవాని మాట్లాడుతూ ముగ్గురు ఆడపిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చదివించేటప్పుడు వేల రూపాయలు ఖర్చయ్యేవని తెలిపారు. జగనన్న సీఎం అయ్యాక ప్రభుత్వ స్కూళ్లను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దడంతో పిల్లలు ఎంతో ఆనందంగా చదువుకుంటున్నారని సంతోషం వెలిబుచ్చారు. మరోసారి జగనన్నే సీఎం కావాలని ఆకాంక్షించారు. అమీన, నాగలక్ష్మి, లక్ష్మీదేవి, తదితరులు అమ్మ ఒడితో ఆర్థిక ఇబ్బంది లేకుండా పిల్లలను చదివించుకుంటున్నామని ఎమ్మెల్యేకి తెలియజేశారు. గుండె సమస్యతో బాధపడుతూ ప్రైవేట్‌గా రూ.3 లక్షలు ఖర్చుచేసుకున్నామని, సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరు చేయించాలని నాగలక్ష్మి ఎమ్మెల్యేకి విన్నవించగా, మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా మానసిక సమస్యతో బాధపడుతున్న నాగలక్ష్మి కుమారుడికి పింఛన్ వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వెంకటమ్మ అనే వృద్ధురాలికి ట్రై సైకిల్ మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం..

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రణాళిక సిద్ధం చేసి, కాలువలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డీఈ రాంప్రసాద్ రెడ్డి, ఏఈ శంకర్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. , అవసరమైతే ప్రత్యేక నిధులను కేటాయిస్తామని తెలిపారు. స్థానికంగా ఉండే మారెక్క, రామాంజినమ్మ, లక్ష్మీదేవిలు కాలువ, రోడ్డు సమస్యకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేకి విన్నవించగా ఆయన స్పందించారు. మురుగు సక్రమంగా వెళ్లేలా కాలువలు అవసరమైన చోటలోతుగా ఏర్పాటు చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. 57వ సచివాలయ పరిధిలోని వడ్డే కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో కాలువ కల్వర్టు, ప్యాచ్ వర్కులు, సీసీ రోడ్డుతో పాటు స్పెషల్ గ్రాంట్ నిధులు రూ.11.5 లక్షలతో సీసీ రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. పట్టా ఉన్న వారు సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటే ప్రభుత్వం రూ.1,80,000 ఇస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల మంజూరుకు కీలకంగా మారిన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలను జాప్యం చేయకుండా సకాలంలో మంజూరు చేయాలని ఆర్‌ఐ విష్ణును ఎమ్మెల్యే ఆదేశించారు. దెబ్బతిన్న పోళ్లను తక్షణం మార్చడంతో పాటు, పలు చోట్ల లైట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏఈ నాగరాజుకు ఆయన సూచించారు. కార్యక్రమంలో మేయర్ వసీం , డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, నాయకులు భూమిరెడ్డి శ్రీదేవి, విజయభాస్కర్ రెడ్డి, నీలూరు సురేష్, గురప్ప, బంగారప్ప, ఆర్వేటు సురేష్, రఫీ, హిదయతుల్లా, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, పెన్నోబులేసు, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఇది పేదల ప్రభుత్వం తల్లీ



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- సిండికేట్‌నగర్‌లో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాప్తాడురూరల్: రాష్ట్రంలో వైఎస్ జగనన్న నేతృత్వంలో పేదల ప్రభుత్వం నడుస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం సిండికేట్‌నగర్‌లో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటా తిరిగారు. ఒక్కో ఇంటికి ఎంత లబ్ధి జరిగిందో అందుకు సంబంధించిన పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో సంక్షేమ పథకాలు అమలు కావాలంటే అధికారులు, టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడేవారన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయి మన ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హత ఉంటే చాలు ఇంటివద్దకే పథకాలు అందుతున్నాయన్నారు. వలంటీర్లు ఒకటికి రెండుసార్లు ఇంటివద్దకు వచ్చి పథకాలు అందేలా చూస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ఉద్యోగులు ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండేలా చేశామన్నారు. మరోమారు జగనన్నను ఆశీర్వదించాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్ర, పార్టీ మండల కన్వీనర్ పవన్, జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల (జేసీఎస్) మండల ఇన్‌చార్జ్ మఠం శ్యాంసుందర్, సర్పంచ్ అంజియాదవ్, ఎంపీటీసీ సభ్యుడు గౌస్, స్థానిక నాయకులు భానుకోట శివ, బాలకృష్ణ, వై.రామకృష్ణారెడ్డి, గుగ్గిళ్ల జయకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం చెక్కుల అందజేత

అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన రైతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి మంజూరైన పరిహారం చెక్కులను రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. అనంతపురం రూరల్ మండలం జంగాలపల్లికి చెందిన రైతు పాలెం గోవిందు, కాటిగానికాలవ గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు గతంలో అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరి కుటుంబాలకు ఇదివరకే రూ. 3.50 లక్షల చొప్పున ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. తాజాగా ఒక్కొక్కరికి రూ. 1.50 లక్షల చొప్పున మంజూరైంది. ఈ మొత్తాన్ని సంబంధిత రైతులకు అప్పులిచ్చిన రుణదాతలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బాధిత రైతుల కుటుంబ సభ్యులు, తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఈశ్వర్‌రెడ్డి, జంగాలపల్లి వీఆర్‌ఓ పురుషోత్తంరెడ్డి, కాటిగానికాలవ వీఆర్‌ఓ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో పురుగు మందు పిచికారీ



డ్రోన్ పరికరాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రాప్తాడురూరల్: ఉద్యాన పంటల్లో పురుగు మందుల పిచికారీకి డ్రోన్ల వాడకంపై బుధవారం అనంతపురం రూరల్ మండలం ఆలమూరులో రైతులకు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో ఉద్యాన శాఖ మర్త్ డ్రోన్స్ ప్రైవేట్ లిమిట్ వారి సాంకేతిక సహాయంతో ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కూలీల ఇబ్బందులు, పిచికారీ చేసే సమయంలో కలిగే ఇబ్బందులను డ్రోన్ల వాడకంతో తగ్గించవచ్చని నిపుణులు పేర్కొన్నారు. ఎకరా పొలం పిచికారీ చేసేందుకు 8 నుండి 10 నిముషాల సమయం పడుతుందని, ఒకసారి బ్యాటరీ రీచార్జ్ చేస్తే 2 ఎకరాల పిచికారీ చేయొచ్చని వెల్లడించారు. మామూలుగా ఒక ఎకరాకు 200 లీటర్ల నీరు అవసరం ఉంటుందని, అదే డ్రోన్ ద్వారా అయితే 10 లీటర్ల నీరు పిచికారీకి సరిపోతుందన్నారు. దీని ధర సుమారు రూ. 6 లక్షల దాకా ఉంటుందన్నారు. ఒక సెట్ బ్యాటరీల ధర 70 వేలు అని పేర్కొన్నారు. ఎకరాకు పిచికారీ ఖర్చు వంద రూపాయలు ఉంటుందన్నారు. డ్రోన్లు నడిపే వారు ఎకరాకు 500 రూపాయలు చార్జ్ చేస్తున్నారని వెల్లడించారు. పూత, కాయల దశలో ఆశించే పచ్చ పురుగు నివారణకు వాడే కొత్త కెమికల్ వయాగో మందును బాయర్ కంపెనీ ప్రతినిధి గౌతమ్ డెమో ద్వారా చూపించారు. మెలోన్స్‌లో ముల్చింగ్ వాడకం వల్ల కలిగే లాభాలను ఉద్యాన సహాయ సంచాలకులు నరసింహ రావు వివరించారు. ఉద్యాన పంటల్లో డ్రిప్ వాడకంపై, ఆసిడ్ ట్రీట్మెంట్‌పై, ఫర్టిగేషన్‌పై జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి ఫిరోజ్ ఖాన్ వివరించారు. త్వరలో రైతు భరోసా కేంద్రాల ద్వారా డ్రోన్లు రైతులకు ప్రభుత్వం అందుబాటులో తీసుకొస్తుందని జిల్లా ఉద్యాన అధికారి రఘునాథ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వయిజర్ బోర్డు సభ్యులు సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బాలికల ఉజ్వల భవితకు కృషి



మాట్లాడుతున్న ఎస్ఐ ఆంజనేయులు

రాప్తాడు: బాలికల ఉజ్వల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ ఆంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్లో బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా మైనర్ బాలికను వివాహం చేసుకుంటే చట్టప్రకారం ఇరవై సంవత్సరాల కంటే తక్కువ కాకుండా జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చెత్తను వేరు చేసి ఇవ్వండి

అనంతపురం క్రైం: తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని అదనపు కమిషనర్ నగర ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని శ్రీనివాస్ నగర్‌లో క్లాప్ ఆటోల పనితీరును ఆయన పర్యవేక్షించారు. ఆటో సిబ్బంది ప్రజలిచ్చిన చెత్తను కేటాయించిన బాక్సుల్లోనే తీసుకెళ్లాలని సూచించారు.

ఆయిల్‌బాల్స్‌లో అడ్డగోలు బాగోతం

- తూతూమంత్రంగా పనులు చేసి రూ.9.5 లక్షలకు బిల్లు!

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలోని ఇంజినీర్ల బాధ్యతారాహిత్యానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. తూతూమంత్రంగా చేసిన పనులకు రూ.లక్షల్లో బిల్లులు సిద్ధం చేయడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ప్రతి పనినీ తనిఖీ చేయాలని ఖరాకండిగా చెప్పే ఇంజినీరింగ్ విభాగం ఉన్నతాధికారి అడ్డగోలు పనుల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి.

ఇదీ సంగతి..

గతేడాది అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలతో నగరంలోని నడిమివంక ప్రాంతంలో వరదలు వచ్చాయి. అధికారులు ఆ విపత్కర పరిస్థితుల్లో స్థానిక ప్రజలను రెండు, మూడ్రోజుల పాటు పునరావాస కేంద్రాలకు తరలించారు. వరద తగ్గుముఖం పట్టడంతో యథావిధిగా ప్రజలు వారి ఇళ్లకు చేరారు. ఇదే క్రమంలో దోమలు అధికమవుతాయన్న కారణాన్ని చూపి నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగంలో ఓ కీలక అధికారికి అసిస్టెంట్‌గా ఉండే డీఈ అడ్డగోలు బాగోతానికి తెరలేపాడు. వాస్తవంగా వర్షపు నీరు, మురుగు నిలువ ఉన్న ప్రాంతాల్లో దోమ లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్‌బాల్స్ వదులుతారు. కానీ నడిమివంకకు ఆనుకుని ఉన్న డివిజన్లలో అటువంటి సమస్య పూర్తి స్థాయిలో లేకున్నా ఓ కాంట్రాక్టర్ ద్వారా ఆయిల్ బాల్స్ తెప్పించారు. కేవలం ఒకటి రెండు డివిజన్లలో తూతూమంత్రంగా ఆయిల్‌బాల్స్ వదిలారు. నాలుగు డివిజన్లలో ఎటువంటి ఆయిల్‌బాల్స్‌ను వదల్లేదు. కానీ సదరు అధికారి రూ.95,000 చొప్పున రూ.9.5 లక్షలు (పది బిల్లులు) ఖర్చు అయినట్లు బిల్లు సిద్ధం చేశారు. ఇదే విషయమై సదరు కాంట్రాక్టర్ బిల్లు పెడుతున్నామని, సహకరించాలని పలువురు ప్రజాప్రతినిధులను కలవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తమ డివిజన్లలో తమకే తెలియకుండా రూ.లక్షల్లో ఆయిల్‌బాల్స్ ఎప్పుడు కాలువల్లో వదిలారని ప్రజాప్రతినిధులు ప్రశ్నించడంతో కాంట్రాక్టర్ ఖంగుతిన్నాడు. మిమ్మల్ని ఓకే చేయించుకుంటే చాలని డీఈ సెలవిచ్చాడని కాంట్రాక్టర్ సదరు ప్రజాప్రతినిధులకు చెప్పాడు. పలువురు ఇంజినీర్లు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై అడ్డగోలు బాగోతానికి తెర లేపినట్లు తెలుస్తోంది.

ప్రతిపక్షాల కుట్రలను జనం నమ్మరు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ వసీం, చిత్రంలో డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి

అనంతపురం క్రైం: మూడున్నరేళ్ల పాలనలోనే నగర రూపురేఖలు మార్చేశామని, టీడీపీ, జనసేన, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా జనం నమ్మరని మేయర్ వసీం పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.20 లక్షలతో 29వ డివిజన్‌లో ఏర్పాటు చేయనున్న కాలువ, రోడ్ల పనులకు బుధవారం మేయర్ భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో నగరం నలుదిక్కులా రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గుత్తి రోడ్డు కనకదాస విగ్రహం నుంచి తడకలేరు వరకు, శ్రీకంఠం సర్కిల్ నుంచి గుత్తి రోడ్డు వరకు, విద్యుత్‌నగర్ నుంచి జేఎన్‌టీయూ, ఎన్‌టీఆర్ మార్గ్ రోడ్లను ప్రధాన నగరాలను తలపించేలా మార్చేశామన్నారు. జనసేన నేత నాగబాబు నగరంలో లోపాలను చూపడానికి వీలుపడక, చెరువుకట్టపై యాక్షన్ చేయడానికి వెళ్లి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి వెనుదిరిగారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా ప్రతి సచివాలయ పరిధిలో రూ.20 లక్షలు, రూ.25 కోట్ల ప్రత్యేక నిధులతో నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాలకు రాజకీయ ఆరాటం తప్ప ప్రజా పోరాటం తెలీదన్నారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సైఫుల్లాబేగ్, నరింహులు, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీనివాసులు, ఖాదర్‌బాషా, బాలమారుతి, హుస్సేన్‌పీరా, తదితరులు పాల్గొన్నారు.

నేడు వసంత పంచమి



శారదా సమాజంలో కొలువైన సరస్వతీ మాత

అనంతపురం కల్చరల్: విద్యతో సంపూర్ణ జ్ఞానం ప్రసాదించేందుకు శ్రీకారం చుట్టే అడుగులు వసంత పంచమితోనే ప్రారంభమవుతాయి. మాఘ మాసంలో వచ్చే శుక్లపక్షంలో 5వ రోజు చదువులతల్లి సరస్వతీ మాత జన్మదినం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారు భూమిపై అవతరించిన రోజుగా భావించే రోజును వసంత పంచమి, శ్రీపంచమి అనే పేరుతో పిలుస్తారు. ఆరోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆమె ముందు అక్షరాభ్యాసం చేయించుకుంటే జీవితాంతం శుభప్రదంగా సాగుతుందని అందరూ విశ్వసిస్తారు. ఆ క్రమంలోనే దశాబ్దాల కిందటే నగరంలో సరస్వతీ మాత ప్రతిరూపంగా శారదా మందిరాలను ఏర్పాటుచేసి ప్రతి వసంత పంచమి నాడు విశేష పూజోత్సవాలు నిర్వహిస్తున్నారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసాలు..

నగరంలోని రెండో రోడ్డులో శారదా సమాజంలోని సరస్వతీ మాత ఆలయంలో గురువారం సాయంత్రం పెద్ద ఎత్తున అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. అలాగే నగర శివార్లలో నిర్మించిన శృంగేరీ శారదా శంకర మఠం, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయ ప్రాంగణంలో శారదామాత మందిరాల్లో ఉదయం సామూహిక అక్షరాభ్యాసాలు, అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఉచితంగా సాగే అక్షరాభ్యాసాలలో చిన్నారులతో అమ్మవారి ముందు తొలి అడుగులకు శ్రీకారం చుట్టాలని నిర్వాహకులు తెలిపారు.

ఎస్‌ఆర్‌ఐటీ ప్రొఫెసర్‌కు ఉత్తమ అవార్డు

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ షేక్ శర్మస్ వలి అత్యుత్తమ థీసిస్, డిసర్టేషన్ అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ పేర్కొన్నారు. మొరాకోలోని సుల్తాన్ మౌలేస్మెన్ యూనివర్సిటీ మలేషియాలోని సిటీ యూనిర్సిటీ సహకారంతో జార్ఖండ్‌లోని రామ్‌ఘర్‌లో జనవరి 21, 22 తేదీల్లో అడ్వాన్స్ ఆప్టిమైజేషన్ టెక్నిక్స్,అప్లికేషన్ (ఏఓటీఏ) 1వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో షేక్ శర్మస్‌వలి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతను ప్రిన్సిపాల్‌తోపాటు మెకానికల్ ఇంజినీరింగ్ అధిపతి డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రొఫెసర్ జయపాల్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



ఆర్డీటీకి విరాళాలు సేకరించి ఇస్తున్న వీసీ రామకృష్ణా రెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పాలక భవనంలో మంగళవారం జరిగిన బిల్డింగ్ కమిటీ సమావేశంలో పలు అంశాలకు ఆమోదం లభించింది. రూ.2.31 కోట్లతో నూతనంగా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఎస్కేయూ లా భవనం నుంచి విద్యుత్ ఆఫీస్, జన్మభూమి క్యాంటీన్, మహాత్మా జ్యోతి రావు పూలే భవనం నుంచి కామన్ మెస్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. త్వరలో న్యాక్ పీర్ కమిటీ ఎస్కేయూను సందర్శించి ర్యాంకింగ్ ఇవ్వనుంది.ఈ నేపథ్యంలో న్యాక్ గ్రేడింగ్ మరింత మెరుగు పరిచేలా పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. రూ.40 లక్షలతో రోడ్ల మరమ్మతులు, భవనాలకు పెయింటింగ్ వేయనున్నారు. రూ.1.20 కోట్లతో బాయ్స్, గర్ల్స్ హాస్టళ్లు ఆధునీకరించనున్నారు. సమావేశంలో ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి, రెక్టార్ ప్రొఫెసర్ ఏ.మల్లిఖార్జున రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఎస్ఈ వి. మధుసూధన్ రెడ్డి, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీరాములు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. రామచంద్ర, పీఆర్వో డాక్టర్ కే.రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి చేయూతనివ్వాలి

అనంతపురం: పేద ప్రజలకు అండగా నిలుస్తున్న ఆర్డీటీ సంస్థకు చేయూతనివ్వాలని ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి అన్నారు. ఎస్కేయూలో బుధవారం మహాత్మ జ్యోతిరావు పూలే భవనంలో 'ఇండియా ఫర్ ఇండియా' అనే కార్యక్రమంపై వర్సిటీ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. జిల్లాలో ఇప్పటి వరకు 80 వేల మంది మహిళలకు ఇళ్ల నిర్మాణం పూర్తిచేశారని, ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్న ఆర్డీటీ సంస్థకు విరివిగా విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీటీ ప్రతినిధి గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

పామిడి: రోడ్డుపైకి ట్రాక్టర్ దూసుకొచ్చిన ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు.. పట్టణంలోని ఎద్దులపల్లిరోడ్డులో అమీర్ అనే వ్యక్తి ట్రాక్టర్ల మరమ్మతు చేస్తుంటాడు. బుధవారం ఉదయం ఓ ట్రాక్టర్‌ను స్టార్ట్ చేసి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలోనే ట్రాక్టర్ ఒక్కసారిగా గేర్ మారడంతో రోడ్డుపైకి దూసుకొచ్చింది. అయితే శేషారెడ్డి ఆటో మొబైట్ షాపుల వద్ద ఉన్న బైక్‌లను ఢీకొని ఆగిపోయింది. పెనుప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. బాధ్యతారహితంగా వ్యవహరించిన అమీర్‌ను మందలించారు.

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణే మోదీ లక్ష్యం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ



మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం అర్బన్: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడమే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమానికి మద్దతుగా బుధవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ చేపట్టిన రిలేదీక్షలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశాన్ని ఇప్పటి వరకు పరిపాలించిన ప్రధాన మంత్రుల్లో మోదీ తప్ప మిగిలిన వారంతా ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించారన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకూ ఈ ఎనిమిదేళ్లలో 26 ప్రభుత్వరంగ సంస్థలను మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరించిందన్నారు. లాభాల బాటలో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలనుకోవడం అత్యంత దుర్మార్గపు చర్యన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్, నాయకులు వేమయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే అనుమతులివ్వాలి

అనంతపురం రూరల్: బిల్డింగ్ నిర్మాణాలు, లేఅవుట్లకు నిబంధనల ప్రకారమే అనుమతులు ఇవ్వాలని డీఎల్‌పీఓ సుమన జయంతి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఈఓఆర్డీలతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చాలా పంచాయతీల్లో ఇంటి పన్నుల విషయంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఫిబ్రవరి నెలఖారుకు వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. అనుమతుల విషయంలో పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అహుడా ప్లానింగ్ అధికారి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



